# చక్రంతిప్పిన చెయ్యి

కొబ్బరిచెట్ల నీడలు నేలమీదకు పడుగు పేకలుగా జారి అల్లిన నీడల తివాసీ మీదుగా పోతున్నాడు సుబ్బారావు. నిటారుగావున్న మట్టిపుంత, రక్తకుల్య దగ్గర ఆగిపోయినచోట కొబ్బరిచెట్ల తలలు చిక్కగా అల్లుకొని పెళ్ళిపందిరి వేసినట్టు అనిపిస్తోంది. వైశాఖమాసం. పొద్దు తిరిగినా ఎండ పోలేదు. పడమటి గాలితో వచ్చిన అనురాగపు జల్లులా ఏటవాలుగా ఆకుల సందుల్లోంచి ఎర్రని సూర్యకిరణాలు దారికిరుపక్కలా తోటల్ని తడుపుతున్నాయి. దూరంగా ఎక్కడో ఏ జీడిమామిడి తోటలోనో, ఏ సరుగుడు తోటలోనో కుదుళ్ళు కట్టుకుంటున్న వాళ్ళెవరో పదం పాడుతున్నారు. తెరలు తెరలుగా గాలివీచినప్పుడల్లా సన్నగా ఆ పాట వినిపిస్తోంది.

సుబ్బారావు ఈలవేసుకుంటూ హుషారుగా నడుస్తున్నాడు. ఉండి వుండి ఏరాతి బెడ్డోతీసి ఏ చెట్టుకొమ్మలోకో విసుర్తూ పక్షుల్ని ఎగరగొట్టి వాటి అరుపుల్నీ చప్పుళ్ళనీ వింటూనో, కిందపడ్డ ఏ కొబ్బరి చప్పిరందెనో తన్నుకుంటూ దానివెనకే పెద్ద పెద్ద అంగల్తో అనుసరిస్తూనో; దారిపక్క ఏ కొమ్మనో విరిచి గాలిలో ఝుళిపిస్తూనో ఉత్సాహంగా నడుస్తున్నాడు.

రెండు నెలల కిందట ఈబాటమీదుగా వొచ్చి వెళ్ళినప్పుడు అతని కింత ఉత్సాహం లేదు. అక్కడింత అందం కనిపించలేదు. వెళ్ళేటప్పుడు తనలోకి తనే చూసుకుంటూ వెళ్ళి, వొచ్చేటప్పుడు తలవంచుకునే వొచ్చాడు. దేన్నో పోగొట్టుకున్న వాడిలాగ దారిపొడుగునా వెతుక్కుంటూ వొచ్చిన అతనికి పరిసరాలే కనిపించలేదు. కొబ్బరితోటలో కాయదింపుతున్న హడావిడిగానీ, సరుగుడు తోటలో కలప కొట్టించి బళ్ళకేస్తున్న ఆర్భాటంగానీ కనిపించలేదు. ఇప్పుడు బాట కడ్డంపడి ఎగిరిపోతోన్న పాలపిట్ట రెక్కల్లో రంగులు కనిపించాయి. బ్రహ్మజెముడు డొంకలో ముళ్ళమధ్య బితుకు

బితుకుగా చూస్తోన్న తెల్లటి బ్రహ్మజెముడు పువ్వు కనిపించింది. ఎక్కడో ఏ ప్రియురాలికో ప్రేమ సందేశాన్ని పంపించాలని సూర్యుడు ముద్దుల్ని మూటగట్టి వొదిలిన మేఘశకలపు చేలాంచలం బరువుగా కదులుతూ కనిపించింది. జీడిమామిడిచెట్టు కొమ్మల్లో ఒకదాన్నొకటి తరుముకుంటూ ఆడుకుంటోన్న ఉడతలజంట కనిపించింది. అవన్నీ చాలా అందంగా ముచ్చట కలిగిస్తూ కనిపించాయి. చివరకు, దూళితో నిండిన గతుకుల మట్టిబాటా, దారిపక్క నీటి ఎద్దడికి ఎండిపోయిన చీపురు పుల్లల దుబ్బులూ, ఆకుల్ని రాల్చేసుకున్న సీతాఫల మోడులుకూడా మనోహరంగా కనిపించాయి.

సుబ్బారావు రక్తకుల్య దగ్గరికి వచ్చాడు.

పడవ, గట్టునే వుంది. నీళ్ళల్లోకి గెంటి గెడకర్రవేశాడు. మెల్లగా నీళ్ళను కోసుకొంటూ పోతోంది పడవ.

సాయంకాలపు సూర్యకిరణాలతో ఎర్రబడి కాలవ నిజంగా రక్తకుల్య లాగే అనిపిస్తోంది. పొడుగ్గా పెరిగిపోతోన్న సాయంత్రపు ఎర్రని సూర్య కిరణం ఏ కొబ్బరిచెట్టు శిరస్సునో తాకి విరిగి కిందపడ్డట్టు ఎర్రగా మెరుస్తోంది—సన్నని రక్తకుల్య కాలవ. ఇంకా దిగువకు మైలుదూరం వెళ్తే రక్తకుల్య సముద్రంలో కలిసినచోట విశాలమౌతుంది. సాయంకాలం వచ్చి పోయే జనం వుంటారుగాని లేకపోతే పడవేసుకుని దిగువకు మైలుదూరం వరకూ వెళ్ళొచ్చేవాడే. అనేకసార్లు సుబ్బారావూ, సూరీడూ వెన్నెల రాత్రుళ్లు కాలవ పోటులో వున్నప్పుడు సరదాగా పడవమీద వెళ్లొస్తుండేవారు. గట్టున పడవమీద కూచుని సినిమాల గురించి చెప్పుకుంటుండేవారు.

సుబ్బారావూ,సూరీడూ స్కూలు ఫైనల్ వరకు కలిసే చదువుకున్నారు. సుబ్బారావు మూడుసార్లు పరీక్షలకి వెళ్ళినా పేసవ్వలేకపోయాడు. ఇంట్లో గొడవపడి చెప్పాచెయ్యకుండా విశాఖపట్నం పారిపోయాడు. మొదట్లో ఒక అపరాల కొట్టులో గుమాస్తాగాచేరి ఆ తర్వాత మార్వాడీ ఫేన్సీ కొట్టులో కుదిరాడు. మూడేళ్ళ తర్వాతగాని అతను తిరిగి యింటికి వెళ్ళలేదు. అతను వెళ్ళేసరికి సూరీడు సెకండరీ గ్రేడు ట్రైనింగై ఆ వూళ్ళోనే మాష్టారుగా పనిచేస్తున్నాడు. సుబ్బారావు పెద్దక్క కూతుర్ని సూరీడుకి యిచ్చి పెళ్ళి చెయ్యాలని రాయబారాలు నడుస్తున్నాయి. ఈ విషయం తెలిసిన తర్వాత

సుబ్బారావు, సూరీడుతో మనస్ఫూర్తిగా మాట్లాడలేకపోయాడు. రక్తకుల్యలో పడవమీద కబుర్లు చెప్పుకుంటూ అతనితో గడపలేకపోయాడు. అసలు ఆ వూళ్ళోనే వుండలేక వారం రోజుల్లోనే తిరిగి వెళ్ళిపోయాడు. సూరీడు పెళ్ళి కూడా అయిపోయింది. మరీ మరీ రమ్మనమనీ సూరీడూ, తన అక్కా బావలు వుత్తరాలు రాసినా సుబ్బారావు కుంటిసాకులు చెప్పి వెళ్ళలేదు. సూరీడు మీద అతనికి కోపమేమీలేదు. తను సరిగా చదువుకోకపోయినందుకూ, సూరీడులాగ ఏ స్కూలు మాష్టరో కానందుకూ, వూరువిడిచి వెళ్ళిపోయినందుకూ, తనమీద తనకే కోపం వొచ్చింది. తనంటే సూరీడుకి చాలా యిష్టం అని తెలుసు అతనికి. అందుకు సాక్షి సూరీడు తనను ఒకసారి వొచ్చి వెళ్ళమంటూ గత రోజున రాసిన వుత్తరమే. ఆ వుత్తరం చూసుకునే సుబ్బారావు బయలుదేరి వొస్తున్నాడు.

పడవ అవతలివడ్డు చేరుకుంది. ఆ వుప్పనీళ్ళలోనే ముఖం కాళ్ళూ చేతులూ కడుక్కుని, సంచి తీసుకుని కదిలాడు. కొబ్బరితోటలకు అడ్డంపడి బయలుదేరాడు.

మైలుదూరం పోతే అతని వూరు వొస్తుంది. మధ్యలో తోటల్లోనే మరో రెండు వూళ్ళు తగులుతాయి. అక్కడి వూళ్ళన్నీ వీధులతో బారులు తీర్చి వుండవు. వూరికి రెండో మూడో వీధులు మాత్రమే వుండి మిగతా సగం గడపంతా కొబ్బరితోటల్లో అక్కడొక మూడూ, అక్కడొక నాలుగు యిళ్ళు చొప్పున విస్తరించి వుంటాయి. రహదారులు పడనివూళ్ళు అవన్నీ, ఇటీవలే గౌతమీ నదిమీద వంతెనకు ప్రారంభోత్సవం జరిగింది. ఇలాంటి మారుమూల గ్రామాలకు కూడా రహదార్లు పడాలంటే మరో పది సంవత్సరాలన్నా పడుతుంది. ఇక్కడ అడుగడుగునా పంటకాలువలే! భారీ బళ్ళ రాకపోకలకు వీలుండని యినకపర్ర! రక్తకుల్యకు అవతల అన్నీ కనీసం రిక్షాలన్నా, పోనీ పాతకాలపు రెండెడ్ల బళ్ళన్నా లేనివూళ్ళు!

చీకటి పడకుండానే యిల్లు చేరుకుందామని గబగబా నడుస్తున్నాడు సుబ్బారావు. చూస్తుండగానే ఆకుల మధ్య నించి సూదుల్లా జారిన సూర్య కిరణాలు వెలిసిపోయాయి. వెలుతురు మాత్రమే మిగిలింది. చెట్లు వొత్తుగా వున్నచోట మసక చీకట్లుకూడా కురుస్తున్నాయి. పాకలముందు పెరడుల్లో

నీళ్ళ కాగులకింద మండుతున్న సర్వీతుక్కు ఎర్రగా తోటల్ని వెలిగిస్తోంది. పాకల్లోంచి తెల్లటి పొగలు పందిరి తీగల్లా పైకిలేచి కొబ్బరిచెట్ల తలల కిందుగా అల్లుకుంటున్నాయి. సుబ్బారావును దారి పొడుగునా ఎవరో పలక రిస్తూనే వున్నారు.

సూరీడు కూడా దారిలోనే కనిపిస్తాడేమోనని, కనిపిస్తే వుత్తరంలో రాసిన విషయాలు వివరంగా అడిగి తెలుసుకోవాలని ఆత్రుతగా వుంది. "సత్తిరాజుగారి పార్వతికి నువ్వంటే చాలా యిష్టమటోయ్. నిన్ను తప్ప మరెవరినీ పెళ్ళిచేసుకోనని అంటోందట. ఈ వుత్తరం చూసిన వెంటనే ఒకసారి బయలుదేరి రా" అని రాశాడు.

ఆ వుత్తరం చూసినప్పుడు నిజంగానే అతనికి ఆశ్చర్యం వేసింది. సత్తిరాజు కూతుర్ని ఎప్పుడో మూడేళ్ళకిందట చూశాడు. అప్పుడు అది యింకా పిరికిణి, జాకెట్టే కట్టుకొనేది. తెల్లారగట్టే తమ తోటలోకొచ్చి తోట లోని రెండు కుంకుడు చెట్లకిందా రాలిన కుంకుళ్ళను దొంగచాటుగా ఏరుకు పోతుండేది. ఒకసారి స్కూల్ ఫైనల్ పరీక్షకు వెళ్తున్న రోజుల్లో సూరీడూ, అతనూ సముద్రపు వొడ్డుకెళ్ళి చదువుకొని వస్తుంటే పుంతలో ఏదో కప్పె డుతూ కనిపించింది ఆ అమ్మాయి. ఏమిటని అడిగితే భయపడుతూ భయ పడుతూ దబ్బులు పారేసుకున్నానని చెప్పింది. ఆ అమ్మాయిని వెళ్ళనిచ్చి అక్కడ వెతికినప్పుడు ఓ బుట్టెడు జీడిగింజలు కప్పెట్టి వున్నవి కనిపిం చాయి! ఆ తర్వాత చిల్లరకొట్టు దగ్గర ఎదురైనప్పుడు గట్టిగా అడిగేసరికి బొట బొట కన్నీళ్ళు కార్చేసి రాగాలుతీస్తూ కొట్టు అరుగుమీదే చతికిలబడి ఏడ్చేసింది. అలాంటి అమ్మాయి యిప్పుడు యింతటిది అయిందంటే అతనికే ఆశ్చర్యంగా వుంది. ఎంతసేపూ అతనికి కోమటక్క కొట్లో ఏ జీళ్ళో, జంతికలో కొనుక్కుని తింటూనో; ఎవరితోటలోనో ఏ సరుగుడు తుక్కో, కొబ్బరి మట్టలో ఏరుకుంటునో చింపిరితలా, మాసిన బట్టల్తో చిన్నపిల్లలాగ కనిపిస్తోందే తప్ప యవ్వనం నింపుకుని శరీరాన్ని దాచుకుంటూ ఆకర్షించగల ఈ ఆరిందాలాంటి పార్వతి కళ్ళకు కట్టడంలేదు.

ఆలోచనలతోనే యిల్లు చేరుకున్నాడు.

ఆకస్మాత్తుగా చెప్పాచెయ్యకుండా వచ్చిన కొడుకును చూసి ఆశ్చర్య పోయాడు తండ్రి. తల్లిలేదు. పదోఏటే పోయింది. అన్న, ఒదిన వున్నారు.

వాళ్ళందరికీ తను యిటీవల జబ్బుపడి వారంరోజులు హాస్పిటలులో వున్నాననీ, తనకింద చేసేవాళ్ళే లేకపోయారనీ, హాస్పిటలు నించి డిస్చార్జ్ కాగానే ఇలా వచ్చేశాననీ చెప్పాడు సుబ్బారావు. వాళ్ళందరూ చాలా కంగారు పడ్డారు. ఆరోగ్యాన్ని గూర్చి ఒకటే పరామర్శ. వాళ్ళ ఆందోళనకు సుబ్బారావు నవ్వుకున్నాడు. అనుకోకుండా చాలా చక్కటి అబద్ధం చెప్పానే అని మురిసి పోయాడు.

స్నానంచేసి, భోజనంచేసి సూరీడు దగ్గరకని బయలుదేరాడు. నిజా నికి సూరీడుని యింటిదగ్గర కలుసుకోవాలనిలేదు. అక్కడికి వెళ్తే కనకమ్మ కనిపిస్తుంది. కనకమ్మని తనకిచ్చి చేస్తారని అతను గట్టిగా ఎప్పుడూ అను కోలేదు. వాళ్ళది కాస్త కలిగిన కుటుంబం. ఎంతయినా బంధుత్వం కదా, మాటవరసకైనా అడక్కపోతారా అనుకున్నాడు. కనకమ్మ బావుంటుంది. చిన్నప్పుడు ఎత్తుకుని ఆడించాడు. తర్వాత బుగ్గలు కొరికి ఏడిపించాడు. ఆ తర్వాత జాంకాయలూ, జీడిపిక్కలూ తీసుకెళ్ళి ఇచ్చేవాడు. ఊరిలోంచి పారిపోయిన తర్వాత కూడా అప్పుడప్పుడూ తలచుకుంటూ వుండేవాడు. అందుకే ఆమె మరొకరి పెళ్ళాం అయిందంటే ఏమిటోలా అనిపిస్తోందేతప్ప బాధలేదు. ఇప్పుడు తనంటే మోజుపడే........

"ఎవరా వెళ్ళేది....సుబ్బారావేనా?"

రత్తమ్మ చిల్లరకొట్టుమీద కూచుని పలకరించింది.

సుబ్బారావు కొట్టు దగ్గరికి వెళ్ళాడు.

"ఎప్పుడొచ్చావబ్బాయ్"

"సాయంకాలమే వొచ్చాను రత్తమ్మక్కా"

"మొన్ననే వొచ్చి వెళ్ళినట్టున్నావ్, పనిమీద వొచ్చావా?"

సుబ్బారావు తలవూపాడు.

"అయితే వారం పదిరోజులపాటు వుంటావన్నమాట" నవ్వుతోంది రత్తమ్మ. ముందు పళ్ళులేవు. నవ్వితే అసహ్యం వేస్తుంది.

వస్తానని చెప్పి సుబ్బారావు బయలుదేరాడు.

"సిగరెట్లేమీ తీసుకోకుండానే వెళ్ళిపోతున్నావేం"

"బస్సుదిగి బట్టీలంకలో కొన్నాను. ఇంకా అయిపోలేదు. రేపు వొస్తాలే"

రత్తమ్మ ఎందుకు నవ్వుతున్నట్టు?

బహుశా రత్తమ్మకి యీ సంగతి తెలిసే వుంటుంది. మహా ఘటికు రాలు రత్తమ్మ. ఊళ్ళో అన్ని సంగతులూ ఆమెకే కావాలి. పదిహేనేళ్ళ కిందట భర్తపోయినప్పటినించీ ఆయన అప్పజెప్పిపోయిన చిల్లరకొట్టే జీవనా ధారంగా చేసుకుని వున్న ముగ్గురు ఆడపిల్లలకూ పెళ్ళి చేసిందంటే ఎంతటి వ్యవహార దక్షత గలదో తెలుస్తూనే వుంది. వడ్డీలకు కూడా తిప్పి పి.డబ్ల్యుడి. ఎక్స్‌టెన్షన్ కాలవపక్కనే ఎకరం కొబ్బరితోట కూడా కొనుక్కుంది. రెండో కూతురు దీర్ఘరోగంతో పుట్టింట్లోనే వుంటోంది. అదే ఆమెకు దిగులు. మరో చింతేలేదు. ఊరివాళ్ల గొడవలతోనే ఆమెకు తెల్లారిపోతుంది.

రత్తమ్మనే కదిపి ఈవిషయం తెల్చుకోవాలి-అనుకున్నాడు సుబ్బారావు.

సూరీడు గురించి యింటికి వెళ్ళక్కరలేకపోయింది. పంచాయతీ ఆఫీసు అరుగుమీదే కనిపించాడు ఎవరితోనో కబుర్లు చెప్తూ. ఇద్దరూ ఎక్స్ టెన్షన్ కాలువ తూముమీదకెళ్ళి కూచున్నారు.

రాత్రి చాలా సేపటి వరకూ కబుర్లు చెప్పుకున్నారు. పార్వతిని గూర్చిన విషయాలన్నీ చెప్పాడు సూరీడు. ఏడాది క్రితమే వ్యక్తురాలైందట. బాగా వొళ్లు చేసిందట. ఆ మధ్య తను వొచ్చి వెళ్ళిన తర్వాత 'కామయ్యగారి సుబ్బారావుని చేసుకోరాదుటే' అని చిల్లరకొట్టు రత్తమ్మ అంటే 'మాలాంటి బీదోళ్లని చేసుకుంటాడా పట్నపాయన' అందట. ఆ తర్వాతే ఏదో సంబం ధాన్ని తిరగ్గొట్టేసిందట. సూరీడు చాలా విషయాలు చెప్పాడు. తనంటే మోజుపడే ఆడదాన్ని పెళ్ళాడకపోవడం తప్పే అన్నాడు. అంతగా అతనికి యింట్లో చెప్పడానికి సిగ్గయితే తనే వాళ్లావిడచేత చెప్పిస్తానన్నాడు. దాంపత్య జీవితాన్ని గూర్చి పుస్తకాల కవిత్వంలో మాట్లాడాడు.

పన్నెండు గంటల వరకూ కూర్చుని ఎవరిళ్ళకువాళ్ళు వెళ్ళిపోయారు. రాత్రంతా సుబ్బారావుకి కలత నిద్రే!

పొద్దున్నలేచి స్నానానికి సముద్రపు వొడ్డు కెళ్లాడు. సముద్రపువొడ్డుకు తీసుకెళ్ళే పుంత పక్కనే తోటలోవుంది పార్వతి వాళ్ల యిల్లు. వెళ్ళేటప్పుడో వచ్చేటప్పుడో కనబడకపోతుందా అని అతని ఆశ. ఈ యవ్వనపు బొమ్మని చూడాలని కోరిగ్గా వుంది. రెండునెలల కిందట అతను వచ్చినప్పుడు కూడా పార్వతిని చూడలేదు.

సుబ్బారావుకు కనీసం పార్వతి పరికిణీ కుచ్చిళ్లయినా, పవిట అంచైనా కనిపించలేదు. వాళ్లవ్వ కనిపించింది. తండ్రి కనిపించాడు. ఇంటి ముందు ముళ్లకంచె కనిపించింది. ముళ్లకంచె యివతల తచ్చాడుతున్న కోడిపుంజు కనిపించింది.

సుబ్బారావుకు చాలా నిరాశ కలిగింది.

మధ్యాహ్నం భోంచేశాక సిగరెట్లకని రత్తమ్మ కొట్టుదగ్గరకు వెళ్ళాడు. సిగరెట్ల విషయం సరేసరి. పార్వతిని గురించి ఏమన్నా తెలియజేస్తుందేమోనని వెళ్తే కొట్టుమీద రత్తమ్మలేదు. కూతురు కూచునివుంది. సిగరెట్లు తీసుకుని వచ్చేశాడు. సూరీడు దగ్గరకు వెళ్దామంటే అతనికి స్కూలు. ఏమీ తోచక యింటికొచ్చి పడుకున్నాడు. తెలివి వచ్చేసరికి ఇంట్లో కనకమ్మ మాటలు వినిపిస్తున్నాయి.

"మామయ్యకి ఎక్కడైనా మంచి సంబంధం చూసి పెళ్ళిచేసెయ్యగూడదూ. పోనీ ఆ పార్వతినిచ్చి చేస్తేనో" అంటోంది.

తను ఎత్తుకుని ఆడించిన కనకమ్మ, తనచేత మొట్టికాయలు తిన్న కనకమ్మ తన పెళ్ళికి రాయబారాలు నడపడం చూస్తే అతనికి నవ్వొచ్చింది. నవ్వుకున్నాడు.

"చినమావ లేచినట్టున్నాడత్తా. మన మాటలన్నీ విన్నట్టున్నాడు" అంది కనకమ్మ గదిలోకి తొంగిచూసి.

"బావున్నావా కనకం?"

"అదేమిటి మామయ్యోయ్! పేరు మార్చేస్తున్నావ్. నా పేరు కనకం కాదు కనకమ్మ" అంది నవ్వుతూ.

"చదువుకున్న మొగుడ్ని కట్టుకుని కనకం అయ్యావేమో అనుకున్నాను"

"అవన్నీ మీ పట్నపోళ్ళకి, మాక్కాదు" అంది. "నీకూ ఓ పల్లెటూరి మొద్దుని కట్టబెట్టాలని చూస్తున్నాం. ఏ సినిమా స్టారులాగా చేస్తావో చూస్తాగా" అంది తిరిగి.

అతనికి చప్పున సూరీడు జ్ఞాపకానికొచ్చాడు. వాడు నిజంగా అదృష్టవంతుడే అనుకున్నాడు.

కనకమ్మ సాయంకాలం వరకూ వుంది. చీకటిపడేవేళ భోంచేసి మరీ వెళ్ళింది. ఆమె వున్నంతసేపూ పార్వతినీ, సుబ్బారావునీ దంపతుల్ని చేసి, ఎన్నో విసుర్లు విసిరింది. తియ్యగా ఏడింపించింది. అతని ఆలోచనలనిండా పార్వతినే నింపి వెళ్ళిపోయింది.

సుబ్బారావు మనసంతా పాలకడలిలా వుంది. చిరువెచ్చని ఆలోచనకే సంతోషం తెరలు తెరలుగా పొంగుకొస్తోంది. కథల్లోలాగ ఒక ఆడది తననే పెళ్ళాడతానని పట్టుబట్టడం అతనికి చాలా ఆనందంగానూ, గర్వంగానూ వుంది.

రాత్రి భోంచేసి సూరీడుతోనూ, వూళ్ళో మరో ముగ్గురు నలుగురు కుర్రాళ్ళతోనూ పంచాయతీ ఆఫీసు అరుగుమీద సినిమా కబుర్లతో గడిపి యింటికి తిరిగివస్తూ కొట్టుమీద తీరుబడిగా కూచున్న రత్తమ్మని చూసి ఆగిపోయాడు. జేబులో సిగరెట్లు వున్నా కావాలని కొనుక్కున్నాడు.

సిగరెట్లు యిస్తూ "అబ్బాయ్! ఏదో పనిమీద వచ్చానన్నావ్. ఏమిటా పని? సొసైటీలో తోటమీద ఏమన్నా అప్పు తేవాలనుకుంటున్నారేమిటి" అంది.

"అబ్బే. అలాంటిదేమీలేదు రత్తమ్మా" అన్నాడు సుబ్బారావు.

"ఏమోలే. సొసైటీలో అప్పు తేవాలంటే యిప్పుడు నీ సంతకంకూడా వుండాలిగా. అందుకని పిలిచారేమో అనుకున్నాను. ఇంతకీ నువ్వొచ్చిన పనేమిటీ, పెళ్ళి సంబంధాలేమన్నా చూస్తున్నారా మీవాళ్ళు?"

ఆమె వ్యవహార దక్షతకి లోలోపలే ఆశ్చర్యపోయాడు. పైకి మామూలుగానే "ఏమో....ఆ విషయాలేవీ నాతో చెప్పలేదు. అలాటిదేమైనా వుంటే నీకు తెలీకుండా వుంటుందా రత్తమ్మక్కా'' అన్నాడు.

రత్తమ్మ నవ్వింది. "మొత్తంమీద ఘటికుడివే. పట్నం వెళ్ళి తెలివి మీరిపోయావు సుమీ" అంది.

సుబ్బారావు చిరునవ్వునవ్వి సిగరెట్టుతీసి వెలిగించుకుని గట్టిగా ఒక్క దమ్ము లాగాడు.

"నువ్వు చెప్పకపోయినా నాకంతా తెలుసులే అబ్బాయ్. మొన్నొచ్చినప్పుడు ఏం నూరిపోశావో, అది నిన్ను తప్ప మరొకరిని పెళ్ళాడనని పట్టుపట్టింది. ఇంతకీ యింట్లో చెప్పావా దాన్నే చేసుకుంటానని''

సుబ్బారావు సిగ్గుసిగ్గుగా "లేదు" అన్నాడు.

"ఆడదానికి లేని సిగ్గు నీకొచ్చిందే. సరేలే. నేనే చెప్తాను మీ నాన్నతో. వాళ్ళయ్య కనిపిస్తే అడుగుతాలే. ఎంత వెతికినా నీకన్నా మంచి సంబంధం తేగలడా, కాదనడానికి" అంది.

ఆ తర్వాతి మళ్ళీ "సుబ్బారావ్! అది చాలా చురుకైన పిల్లయ్యా. దానిది శుభమైన జాతకం. అది బోణీ చేసినరోజు సాయంకాలానికి తేలిగ్గా పది రూపాయలన్నా అమ్మకం వుంటుంది" అంది.

ఎవరో పొగాక్కాడలకని వొచ్చి యింటి విషయాలవీ చెప్తూ అక్కడే తిష్టవేశాడు. ఈనెలన్నీ వొలిచి, చుట్ట చుట్టుకుని వెలిగించుకునే వరకూ కదిలేటట్టు లేడు చూసి చూసి సుబ్బారావే అక్కడనించి కదిలి వొచ్చేశాడు

ఆ తర్వాత మూడు రోజుల వరకూ రత్తమ్మ అసలు ఈ విషయాన్ని ప్రస్తావించనేలేదు. రోజుకి మూడుసార్లయినా సిగరెట్ల నెపంతో ఆ కొట్టుకి వెళ్ళి వస్తుండేవాడు. సిగరెట్ల వాడకం కూడా ఎక్కువయ్యింది. పార్వతి కూడా ఒకరోజు అదే కొట్టు దగ్గర ఎచ్చాలు కొనుక్కెళ్తూ కనిపించింది. పంచాయతీ ప్రెసిడెంటూ, మరో ముగ్గురూ అదే దారిన వస్తున్నారు. లేకపోతే పలకరించేవాడే.

గుర్తుపట్టలేనంతగా మారిపోయింది పార్వతి. కాలవ వార కొబ్బరి మొక్కలాగ ఏపుగా ఎదిగింది. ఒడ్డూ పొడుగూ వొచ్చి నిండుదనంతో, అందంతో ముద్దబంతిపూవులాగ అందరి చూపుల్నీ ఆకట్టుకుంటోంది. కలాపి జల్లి, ముగ్గులు తీర్చిన యిల్లు పెరడులో పాదులూ పూలమొక్కల్తో కలకల్లాడినట్టు మెరుస్తోంది ముఖం. సముద్రపు గాలికి ఆమె వొంటిమీద యవ్వనం తుళ్ళుతూ పకపకా నవ్వుతోంది. గట్లమధ్య వొదిగొదిగి ప్రవహిస్తూ మాటి మాటికీ పక్కదాట్లువేసే పంటబోదెలాగ సంఘం గీచిన సరిహద్దులమధ్యనే చాలా అమాయకంగా కదిలే ఆమె చూపులు. వుండి వుండి రహస్యంగా పక్కలకు చెదిరిపోతున్నాయి. ఇసికలోకి పొర్లుకుంటూ వొచ్చిన సముద్రపు కెరటం వొడ్డున తెల్లటి నురగల్ని విదిల్చినట్టు సంతోషం అలలు అలలుగా కొట్టుకొంటూ వొచ్చి చిరునవ్వు నురగల్ని గట్టున పడేస్తోంది. ఉదయాన్నే పాకలమీద వాలిన పొగ మంచులాగ నునుసిగ్గును వొళ్లంతా కప్పుకుంది. దగ్గరకు వొచ్చేవరకూ గుర్తుపట్టలేక పోయాడు.

చెట్టు చిటారు కొమ్మన కూచున్న పక్షి ఉదయపు తొలి వెలుగు రేఖను చూసి రెక్కలాడించి గాలిలోకి ఎగిరిపోయినట్టు అతని మనసు రెపరెపలాడి ఎటో ఎగిరిపోయింది. ఆ రోజున అతను విపరీతంగా సిగరెట్లు కాల్చాడు. సూరీడునీ, వూళ్లో మరో ముగ్గురు నలుగురు కుర్రాళ్లనీ వెంటబెట్టుకుని సైకిళ్ళ మీద మైలుదూరం వెళ్ళి, రక్షకుల్యదాటి, మరో నాలుగు మైళ్లువెళ్ళి మలికిపురం వూళ్లో సినిమా చూసి, అంతరాత్రిలోనూ తిరిగి అంతదూరమూ పాటలు పాడుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ వొచ్చారు. దారిలో, పాకలమీద వెన్నెల పూసిన వెండి మలాము చూశాడు. అలలమీద ఉయ్యాలలూగిన చంద్రుడ్ని చూశాడు. ఇసికలో రంగురంగుల మెరుపుల్ని చూశాడు పడుకునేముందు, సినిమాలో చూసిన యుగళ గీతాన్ని జ్ఞాపకం చేసుకున్నాడు. పల్లిగ్గా సముద్రపు వొడ్డునా, తోటలోనూ, హీరో హీరోయిన్లు గెంతుతూ పాటపాడిన ఘట్టాల్ని తలంచుకుంటూనే నిద్రపోయాడు.

కాని అతని అంత సంతోషమూ ఆ మర్నాడు నీరుగారిపోయింది. పార్వతి తండ్రి సత్తిరాజుని ఎవరో ఫలానా సుబ్బారావుకి మీ అమ్మాయిని యివ్వరాదటయ్యా అంటే "అలాగే, చూద్దాంలే" అన్నాడట. ఆ వార్త అతని వరకూ వచ్చింది. ఆ చూద్దాంలే అన్నమాట ఆమెకూ తనకూ మధ్య బ్రహ్మ జెముడు డొంకలా అనిపించింది సుబ్బారావుకు. దానికి సూదిగా ముళ్ళూ, పురుగూ పుట్రావుండి, పార్వతి కనిపించనీయకుండా ఆవరించి, ఆమెదగ్గరకు వెళ్లనీయకుండా అడ్డుగా నిలిచివున్నట్టు అనిపించింది. సూరీడుతో ఆ విషయం చెప్తే "ఏదో యధాలాపంగా అనుంటాడు అంతే. అందరికీ యిష్టమైన సంబం ధాన్ని కాదనే మాటేలేదు" అన్నాడు.

అయితే రెండు రోజుల తర్వాత రత్తమ్మ చెప్పిన విషయంతో సుబ్బారావు మరీ దిగులుపడిపోయాడు. సత్తిరాజులు పొగాక్కాడలకని వొచ్చినప్పుడు రత్తమ్మే యీ విషయం కదిపిందట. "వాళ్ళతో వీళ్ళతో కబురంపించడమేటి, తనేవొచ్చి అడగొచ్చుగా" అన్నాడట. ఆ విషయం యింటికొచ్చి మరీ చెప్పింది రత్తమ్మ.

"ఆడపిల్ల తండ్రికే అంత బెట్టుసరైతే మగపిల్లాడ్ని కన్న నాకెంత బెట్టుండాలి? చచ్చినా అడిగేది లేదు." అన్నాడు సుబ్బారావు తండ్రి. సుబ్బా

రావు అన్నయ్య అసలు ఈ సంబంధమే వొద్దన్నాడు. సుబ్బారావుకికూడా పార్వతి తండ్రి అలా బెట్టుచేయడం నచ్చలేదు. చికాకు కూడా కలిగింది.

పంతాలూ, పట్టింపులూ వొచ్చాయి. వీళ్లు అడగనూ లేదు, వాళ్లు యిస్తామని అననూలేదు. ఒకరి కొకరు ఎదురు పడితే యితర విషయాలు మాట్లాడుకునేవారేతప్ప సంబంధంగురించి ఎత్తేవారు కాదు. వాళ్ళతోపాటు సమానంగా తన తండ్రీ వాళ్లూ పట్టుపట్టడం మొదట్లో సుబ్బారావుకు నచ్చలేదు. కాని అవతలివాళ్ళ మొండి ధోరణి చూసేసరికి అతనికే పౌరుషం వొచ్చింది. పైపెచ్చు ఆ పిల్ల ఒకవైపు తననే పెళ్ళాడ్తానని పట్టుపడుతూంటే మరోవైపు తాము వెళ్ళి ప్రాధేయపడలేదని బెట్టుచేయడం అర్థంలేని విషయంగా అనిపించింది. ఇదెంతకాలంసాగుతుందో నేనూ చూస్తాను—అనుకున్నాడు సుబ్బారావు.

సుబ్బారావు ఆ వూరొచ్చి దగ్గరదగ్గర నెల రోజులు కావస్తున్నా సత్తిరాజు వొచ్చి వాళ్ళమ్మాయిని చేసుకోమని ప్రాధేయపడలేదు. పైపెచ్చు యిప్పుడిప్పుడే పై సంబంధాల గురించి ఆవూరూ, యీవూరూ తిరుగుతున్నాడు కూడాను. రాజోలు సంబంధం ఒకటి తెస్తే పార్వతి తిరగ్గొట్టేసిందట. ఆ అమ్మాయిని ఇంట్లో కష్టపెడుతున్నారట. ఒకసారి వాళ్ళయ్య చెయ్యి చేసుకున్నాడట కూడా. ఈ విషయాలు రత్తమ్మ చెప్పినప్పుడు సుబ్బారావు కాస్త మెత్తబడ్డాడు.

లేనిపోని పంతాలకుపోయి తనంటే మనసుపడే అమ్మాయిని ఏడిపించకూడదనుకున్నాడు. సూరీడుతో చెప్తే "నిజమే మధ్యలో ఆ అమ్మాయి నలిగిపోతోంది. నేను అడిగిస్తాలే" అన్నాడు. సూరీడు వెళ్ళి భార్యతో చెప్పినట్టున్నాడు. ఓ సాయంత్రపు వేళ కనకమ్మ వొచ్చింది. సుబ్బారావు వొదినను వెంటబెట్టుకుని పార్వతివాళ్ళింటికి వెళ్ళింది.

ఆ సాయంకాలం సుబ్బారావు ఎక్కడికీ కదలకుండా యింటిదగ్గర కూచుని వున్నాడు.

దీపాలు పెట్టేవేళ, వెళ్ళిన యిద్దరూ తిరిగొచ్చారు. చిరచిర లాడుతూ వొచ్చి "గతిలేని వెధవకి కూడా ఎంత గర్వమో చూడు. నేనూ చూస్తాను యింతకన్నా మంచి సంబంధం ఎలా తెచ్చి చేస్తాడో" అంది సుబ్బారావు వొదిన.

"ఏం చూసుకోనో యీ మిడిసిపాటు" అంది కనకమ్మ.

సుబ్బారావుకు అర్థమైంది. చెప్పులైనా వేసుకోకుండా అరుగుమీద కూచున్న వాడల్లా అలాగే వీధిలోకి వెళ్ళిపోయాడు. వెళ్ళి వెళ్ళి కాలవ తూము మీద కూచున్నాడు.

పార్వతి తండ్రి ఎందుకు వొప్పుకోలేదు?

వాళ్ళకన్నా తాము కలిగినవాళ్ళే. కాస్తో కూస్తో చదువుంది. పట్నంలో నాలుగురాళ్లు సంపాదించుకొంటున్నాడు. మరి ఎందుకు తిరగ్గొట్టేసినట్టు?

అతనికి చాలాకోపం వొచ్చింది. పార్వతి తండ్రిమీదా, సూరీడు మీదా, ఈ రాయబారం నడిపిన వొదినమీదా, కనకమ్మమీదా, చివరికి ఈ అమ్మాయే తప్ప మరో గతిలేనట్టు యింతదూరం వొచ్చిన తనమీదా కోపం, చిరాకు వొచ్చాయి.

'ఛెస్! ఈ వూళ్లో ఒక్కరోజన్నా వుండకూడదు. రేపే ప్రయాణం కట్టెయ్యాలి'-అనుకున్నాడు.

రాత్రి చాలాసేపటి వరకు వొంటరిగానే చీకట్లో ఆ తూముమీదే కూచుని యింటికి బయలుదేరాడు. కాలవ నీళ్ళ చప్పుడూ, దూరంగా సముద్రపు హోరు తప్ప ఏ శబ్దమూ లేదు. అప్పుడప్పుడు గాలి వీచినప్పుడల్లా సరుగుడు తోటలోంచి ఝుయ్యిమని శబ్దం వొస్తోంది. తుప్పల్లో అక్కడక్కడా మిణుగురులు ఎగురుతున్నాయి. నక్షత్రాల వెలుతుర్లో కొబ్బరిచెట్లమధ్య వూరు ముడుచుకుపోయిన తాబేలులా వుంది. ఊరంతా గాఢనిద్రలో వుంది. కలలు కూడా కనడం చేతకానివూరు మత్తుగా నిద్రపోతోంది! సుబ్బారావు ఒక్కడే కాలవగట్టుమీంచి, యిసక బాటలోంచి, బ్రహ్మజెముడు పుంతలోంచి దెయ్యంలా నడిచి యింటిని చేరుకున్నాడు. అన్నం తినాలనిపించక అలానే పక్కమీద వాలిపోయాడు.

ఉదయం లేచేసరికి సన్నసన్నగా చినుకులు పడుతున్నాయి. తొలకరి చినుకులు ఆరంభమైనాయి. నేలంతా తడిసి కమ్మని వాసన వొస్తోంది. చలిగా వుంది. కాలకృత్యాలు తీర్చుకుని సూరీడు యింటికి బయలు దేరాడు. తర్వాత

అయితే స్కూలుకి వెళ్ళిపోతాడని ఈలోపలే యింటికి వెళ్లి సురీడుకి, కనకమ్మకి తన వూరు ప్రయాణం గురించి చెప్పివద్దామని బయలుదేరాడు. దారిలో రత్తమ్మ కొట్టుకెళ్లి సిగరెట్ల కాతా ఎంత అయిందో చూసి డబ్బిచ్చేద్దామనుకున్నాడు.

రత్తమ్మ కొట్టుమీద ఎవరూలేరు. ఇంట్లో పని చూసుకుంటున్నారుగాబోలు, పిలిచేసరికి రత్తమ్మే వొచ్చింది.

"ఇంత పొద్దుటే వొచ్చావేమబ్బాయ్" అంది వొస్తూనే.

"ఏమీలేదు. చినుకులు పడుతున్నాయి కదా, ఒక్కసారిగా నేల చల్లబడి పోయింది....ఏదీ ఓ బర్కిలీ పేకెట్టు యివ్వు."

ఆమె పేక్కెట్టు యిచ్చి దానినికూడా కాతాలో ఎక్కించబోతోంటే "అక్కర్లేదులే, డబ్బిచ్చేస్తాను, మొత్తం ఎంతయిందో చూడు" అన్నాడు.

ఆమె ఏమిటన్నట్టు చూసింది.

"వూరెళ్లి పోతున్నాను. ఒచ్చి చాలారోజులైంది కదూ. ఎంతకాలం పనీ పాటా లేకుండా కూచునేది" అన్నాడు.

ఆమె అర్థమైనట్టు చిరునవ్వు నవ్వింది. "రాత్రి కనకమ్మ అంతా చెప్పిందిలే అబ్బాయ్, వాళ్లు ఒప్పుకోలేదని కోపంవొచ్చి వెళ్ళిపోతున్నావన్నమాట!" అంది.

సుబ్బారావు మాట్లాడలేదు. రత్తమ్మ దగ్గర పుస్తకం తీసుకుని తన బాకీ ఎంతుందో లెక్కగట్టి పదిరూపాయల నోటు ఆమెకిచ్చాడు. ఆమె కూడా ఒకసారి లెక్కచూచుకుని చిల్లరయిస్తూ—

"ఆదేమో నీకోసం పడిచస్తోంటే నువ్విలాగ వూరువిడిచి పోతానంటావేమిటయ్యా. రాత్రి ఏమయ్యిందో తెలుసా. ఎవరితోనూ అనబోక. ఆ పిల్ల నల్లమందూ, నూనె తాగేసిందట! ఇంట్లో వాళ్ళకి తెలిసి ఆచార్లు గారిని పిలిపించి కక్కించారట. రాత్రి ఆచార్లుగారు హడావిడిగా పోతోంటే ఏమిటో అనుకున్నాను. ఎంతపని చేసిందో చూశావ్. దానికి యింకా భూమ్మీద నూకలున్నాయిగాని...."

"అలాగా!" అన్నాడు సుబ్బారావు. సూరీడు యింటికి వెళ్ళకుండానే వెనక్కు తిరిగి వెళ్ళిపోయాడు.

ఆరాత్రి సూరీడూ, సుబ్బారావూ కలిసివెళ్తోంటే రత్తమ్మ అడిగింది. ''వూరెళ్ళలేదా అబ్బాయ్'' అని.

"లేదు. వర్షంగా వుందికదూ, అందుకని ఆగిపోయాను'' అన్నాడు.

నాలుగు రోజులు గడిచినా అతను వెళ్లలేదు. రత్తమ్మ అడక్కుండానే సంజాయిషీ యిచ్చుకుంటున్నట్టు ఒక రోజు "ఆ యిసిక దిబ్బమీద సరుగుడు తోట అమ్మాం. డబ్బింకా చేతికి అందలేదు. అందితే కొంత డబ్బు అడిగి పట్టుకెళ్దామని వుండిపోయాను" అన్నాడు.

''ఓహో!'' అన్నట్టు తలాడించింది రత్తమ్మ.

సుబ్బారావు ఓ మధ్యాహ్నం భోంచేశాక వాళ్ళ సరుగుడుతోటలో కలప కొట్టిస్తున్నచోటికి బయలుదేరాడు.

ఇసికపుంతలోంచి నడుస్తున్నాడు. పుంతపక్కనే జీడిమామిడితోట. మధ్యలో యిల్లు. ఇంటిచుట్టూ ముళ్లకంచె. కంచె అవతల పార్వతి. కంచె మీద దయగా జారిన కాస్తంత ఎండపొడలోనూ బట్టలు ఆరబెడుతోంది. పార్వతి సుబ్బారావును చూసింది. చూస్తూనుంచుంది. చలనం లేదు. సుబ్బారావు ఆగిపోయాడు. చూస్తున్నాడు. ఓనిముషంపాటు అలానే వుండిపోయాడు. ఆమె కంచె యివతలికి వచ్చింది. సుబ్బారావు ఆమెనే చూస్తున్నాడు. ఆమె ఇంటి వెనక్కి నడిచి ఆగి చూసింది. సుబ్బారావు యింకా చూస్తూనే వున్నాడు. నడుస్తోంది ఆమె. ఆగిఆగి చూస్తూ చూస్తూ నడుస్తోంది. ఇల్లుదాటి వందగజాల దూరం వొచ్చేసింది అతను ఇంకా అలానే వున్నాడు. ఆగిపోయింది ఆమె ఒకటి, రెండు, మూడు నిమిషాలు. సుబ్బారావు రెప్ప వెయ్యకుండా చూస్తున్నాడు. ఇంకో నిమిషం. మరో నిమిషం కూడా. బొమ్మలా నుంచున్న ఆమె చివాల్న కదిలింది. వెళ్ళిన దారమ్మటే చర చరా వెనక్కు తిరిగివస్తోంది. వెల్లువలో పడి కొట్టుకొచ్చేస్తున్నట్టు పెద్ద పెద్ద అంగల్తో వొస్తోంది అప్పటికి గాని సుబ్బారావుకు స్ఫురించలేదు. గబ గబా పుంత దాటి తోటలోకివెళ్ళాడు. తనవైపే వొస్తోన్న అతన్ని చూసి ఆగిపోయింది దగ్గర్లో జీడి మామిడిచెట్టు నీడలోకి కదిలి చూస్తోంది. దగ్గరకు వొచ్చేశాడు.

"బాగున్నావా పార్వతీ"

అంత సేపూ లేని సిగ్గు ఒక్కసారిగా ముంచుకొచ్చి మాటరాక తల ఊపింది.

''నల్లమందు, నూనె తాగావట. ప్రాణం తీసుకుందామనే"

చివాల్న తలెత్తి ఓ క్షణంపాటు నిదానించి అతన్నే చూసింది. "ఎవరన్నారు అలాగని?"

"ఇంకెవరూ....రత్తమ్మ. నిన్నుగురించి నాకు చెప్పే వాళ్ళెవరున్నారు ఆమెగాక."

పార్వతి ఏమీ మాట్లాడలేదు. ఆలోచిస్తూ వుండిపోయింది—ఆ అబద్దాన్నే తలచుకుంటూ.

"రత్తమ్మకి నువ్వంటే చాలా అభిమానం. నీ సంగతులన్నీ నాకు ఆవిడే చెప్తుంది."

"నువ్వన్నా అభిమానమే. మొదట్లో నువ్వొచ్చినట్టు రత్తమ్మే చెప్పింది. ఇశాఖపట్నంలో వున్నావటిగా, అబ్బో! పెద్దూరే''

ఎండుటాకుల మీదికి ఏ ఉడతో దూకినట్టుంది. గరగరమంది. సుబ్బారావు బెదిరినట్టు చూశాడు. ఆమె నవ్వింది.

''మీ అయ్య లేడా యింట్లో"

"ఉన్నాడు. ఏం. ఇంటి కెళ్దారా?"

అతనేమీ సమాధానం చెప్పకుండా ''మీ అయ్యకి నేనంటే ఎందుకంత కోపం?'' అన్నాడు.

ఆమె జవాబివ్వకుండా నేలచూపులు చూస్తూ వుండిపోయింది.

అతనికికూడా ఏం మాట్లాడాలో తోచడంలేదు. నిశ్శబ్దంగా వుంది. అప్పుడప్పుడు ఏ తొండో, ఉడతో ఎండుటాకులమీద కదలిన చప్పుడు, అవతల ఎక్కడో కొబ్బరి మట్టల్ని నరుకుతున్న శబ్దం తప్ప ఏ అలికిడీలేదు.

''ఇక ఇశాకపట్నం ఎల్లవా?'' అంది పార్వతి నిశ్శబ్దంలోంచి.

"ఏమో, ఇంకా తేల్చుకోలేదు. వెళ్ళడమా, మానేసి యిక్కడే ఏమన్నా వ్యాపారం పెట్టుకోడమా యింకా ఆలోచించుకోలేదు" అన్నాడు.

"అక్కడేదో కొల్లో కుదిరావట. మానేసి వొచ్చి సేవా?"

"లేదనుకో. మళ్ళీ వెళ్తే అక్కడే చేరొచ్చు. కాకపోయినా, మరో చోటన్నా దొరుకుతుందిలే"

"మనూరికన్న ఇశాకపట్నవే బావుంటుంది కదూ."

ఆ అమాయకపు ప్రశ్నకు అతనికి చెప్పలేనంత నవ్వొచ్చింది. ఆపుకుని ఆపుకుని మరీ నవ్వుతున్నాడు అతను.

తననే చూస్తోన్న పార్వతి చూపులు మరోవైపు జారిపోయి, అక్కడే నిలిచిపోవడం గమనించి సుబ్బారావు వెనక్కు తిరిగి చూశాడు. పుంతలోంచి ఎవరో వొస్తున్నారు.

బ్రహ్మజెముడు డొంక పల్చబడిన చోట కాళ్లల్లోంచి స్పష్టంగా కనిపిస్తోంది. ఆ వొస్తున్న వ్యక్తి పార్వతి తండ్రి సత్తిరాజు!

"మీ అయ్యా?" అన్నాడు సుబ్బారావు. గుర్తించానన్నట్టుగా తలాడించింది ఆమె.

"ఇందాక యింట్లోనే వున్నాడన్నావ్ మరి. బయటినించి వొస్తున్నాడేం?"

పార్వతి సమాధానం చెప్పలేదు. నవ్వి వూరుకుంది.

"మనల్ని చూశాడా?"

"ఏమో, చూసే వుంటాడు."

"నేను వస్తాను మరి. ఈ మధ్య నువ్వు రత్తమ్మ కొట్టువైపు రావడం మానేశావేం" అంటూ సమాధానమన్నా వినకుండానే పుంతవైపు కాకుండా యింటి వెనకవైపు వెళ్ళి, జీడిమామిడి తోటలోంచి ఆ వెనక కొబ్బరితోటలోకి వెళ్ళిపోయాడు. అతను కనిపించినంతమేరా చూస్తూనే వుండిపోయింది ఆమె.

ఆ రాత్రే సుబ్బారావుని కాలవగట్టుమీద పట్టుకుని కొట్టాలని చూస్తున్నట్టు తెలిసింది. రత్తమ్మే ఆ సంగతి చెప్పింది. సుబ్బారావుకూడా మెరికల్లాంటి కుర్రాళ్ళని అరడజను మందిని పోగుజేసుకుని సిద్ధంగానే వున్నాడు. రాత్రి ఒంటిగంటవరకూ వొక్కడూ తూము మీద కూచున్నాడు. ఎవడూ తారసపడలేదు. కొబ్బరి తోటలోనూ, ప్రైమరీ హెల్తు సెంటర్ అరుగుమీదా, బడి ఆవరణలోనూ కాపుగావుంచిన కుర్రాళ్ళని యిళ్ళకు పంపించేసి అతను వెళ్ళిపోయాడు.

మర్నాడు కూడా రడీగానే వున్నారు కాని ఏ గొడవా జరగలేదు. మూడోనాడు ఆ విషయమే ఎవరూ పట్టించుకోలేదు. పైపెచ్చు ఆ రోజు పగలంతా వర్షం కురుస్తూనేవుంది. సాయంత్రమే కాస్త తెరిపి యిచ్చింది.

వర్షం తగ్గడంతోనే హడావిడిగా పరుగెత్తుకొచ్చాడు సూరీడు. సుబ్బారావుని వీధిలోకి తీసుకెళ్ళి "విన్నావా! పార్వతి, రాజోలు సంబంధానికి వొప్పేసుకుందట. నీ దగ్గరకే బయలుదేరి వొస్తోంటే రత్తమ్మ పిలిచి చెప్పింది" అన్నాడు.

సుబ్బారావు ఘ్రాన్పడిపోయాడు. అదేదో వివరంగా తెలుసుకుందామని సూరీడుని వెంటేసుకుని రత్తమ్మ దగ్గరకు వెళ్ళి అడిగితే 'నిజమే' అన్నట్టు తలాడించింది.

"ఇందాక వుల్లిపాయలకని వర్షంలో తడుస్తూ వొచ్చింది. 'నల్లమందూ నూనే తాగావట ఏమిటే' అంటే మాట్లాడిందికాదు. గట్టిగా చీవాట్లు పెట్టాను. 'నిజమే తప్పయిపోయింది రత్తమ్మా. ఇన్నాళ్ళూ ఆడే అని పట్టుకుని ఏళ్ళాడేను. ఆడు వొట్టి పిరికి ఎదవ. అలాటి పిరికి సన్నాసిని కట్టుకునేదేటి. అందుకే రాజోలు సంబంధం వొప్పేసుకున్నాను' అంది. ఎంత పిలిచినా మరిక వినకుండా వెళ్ళిపోయింది—" అంది రత్తమ్మ.

సుబ్బారావు ప్రతిమలా స్తంభించిపోయాడు. అతని నోటమాట పెగల్లేదు. రత్తమ్మ ఎదుట నిలుచోవడం కూడా అతనికి సిగ్గుగానే వుంది. తర్వాత కలుస్తానని సూరీడుని పంపించేసి యింటికి వొచ్చేశాడు. పార్వతి అంతమాట అనడం అతనికి తలకొట్టేసినట్టుంది.

ఆ రాత్రి అన్నం సహించలేదు. నిద్రకూడా పట్టలేదు.

రాత్రంతా ఒకటీ ఒకటీ చినుకులు రాలుతూనే వున్నాయి. నక్షత్రాల వెలుతుర్ని కూడా జారిపోనీకుండా మబ్బులు మూట కట్టేసుకున్నాయి. ఊరంతా తడి తడిగా, చలి చలిగా, చీకటిగా వుంది.

తెల్లవారుఝామున పక్షులు యింకా లేవకుండానే పార్వతి యింట్లో కోడికూసింది.

బాగా ఎండబడ్డాక మొత్తం వూరు వూరంతా కోడైకూసింది.

ఆ కూతలో రత్తమ్మ కంఠం మాత్రంలేదు.

(1968)

★